ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

వందేళ్ల ప్రేమ

నేడు సత్యసాయి బాబా శత జయంతి

- వేడుకలకు ముస్తాబైన హిల్‌వ్యూ స్టేడియం
- పాల్గొననున్న ఉపరాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల సీఎంలు



పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు పుట్టపర్తిలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక కేంద్రం అందంగా ముస్తాబైంది. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన సాయి భక్తులతో పుట్టపర్తిలో సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ టస్టు సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పుట్టపర్తిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభం కాగా ఇప్పటికే ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షల మంది భక్తులు పుట్టపర్తిని సందర్శించారు.

పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియం సత్యసాయి శతజయంతి వేడుకలకు వేదిక కానుంది. ఉదయం 9 నుంచి 11 గంటల దాకా నిర్వహించే వేడుకల్లో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి నారాలోకేశ్ తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హిల్‌వ్యూ స్టేడియాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. స్టేడియంలో వేల మంది ఉత్సవాలు వీక్షించేలా అతి పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

విశ్వప్రేమకు ప్రతిరూపం.. సత్యసాయి

- ఆయన బోధనలు మానవాళికి పాఠాలు
- శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పంచ సూత్రాలతో ప్రపంచ శాంతి

- శత జయంతి వేడుకలలో సీఎం చంద్రబాబు



(వివరాలు మెయిన్‌లో...)

కనకదాసకు కలశం



కలశం మోస్తున్న మంత్రి సవిత

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. కనకదాసకు కలశం మోపారు. రొద్దం మండలంలోని కలిపి కలిపి గ్రామంలో కనకదాస విగ్రహాన్ని మంత్రి శనివారం ఆవిష్కరించారు. తన తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం కనకదాస విగ్రహాన్ని మంత్రి బహూకరించి, ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజసేవ కోసం కనకదాస అహర్నిశలు కృషి చేశారన్నారు. కనకదాస విగ్రహాలను ఏ గ్రామానికైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కురుబలకు సబ్సిడీ రుణాలు, బీమా అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కనకదాస జయంతి నిర్వహించడానికి జీఓ తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం మహిళలు పెద్దఎత్తున కలశాలు మోసుకొచ్చి, కనకదాసకు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శంకర్‌నారాయణ, పెనుకొండ మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ మంజు, సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్ర పాల్గొన్నారు.

- రొద్దం, ఆంధ్రజ్యోతి

మీరే మార్గదర్శకులు

సత్యసాయి సేవలను విశ్వవ్యాప్తం చేయండి

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

- ఘనంగా శ్రీసత్యసాయి వర్సిటీ 44వ స్నాతకోత్సవం



విలువలతో కూడిన విద్య సత్యసాయి వర్సిటీ


ప్రత్యేకత

- ధైర్యానికి, త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీక రాయలసీమ
- మంత్రి నారా లోకేశ్




(వివరాలు మెయిన్‌లో...)










ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు

ధర్మవరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పన కోసం 314 మంది శ్రామికుల నుంచి గ్రామసభలో దరఖాస్తులు వచ్చినట్లు ఏపీఓ సుధాకర్ తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆదేశాల మేరకు శనివారం ఉపాధి హామీ పథకంలో పనుల కల్పనకు మండలం లోని 20పంచాయితీల్లో సచివాలయాల వద్ద, రచ్చకట్టల వద్ద గ్రామసభలు నిర్వహిం చారు. నూతన జాబ్‌కార్డుల కోసం 86మంది దరఖాస్తు చేసుకోగా, హార్టికల్చర్ కోసం 11మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు ఏపీఓ సుధాకర్ తెలిపారు. మండలంలో 269 బోగస్ జాబ్‌కార్డులను రద్దు చేసినట్లు ఏపీఓ తెలిపారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా శనివారం ఉపాధి హామీ పథకం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా జాబ్ కార్డుల పునరుద్ధరణ కోసం 58, కొత్త జాబ్ కార్డుల కోసం 75 దరకాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



వరి రైతులకు తుఫాను భయం


గాండ్లపెంట వద్ద నేలవాలిన వరి పంట

గాండ్లపెంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం సూచిస్తోంది. దీంతో వరి రైతుల్లో తుఫాను భయం చు ట్టుకుంది. గాండ్లపెంట మండల వ్యాప్తంగా 14 పంచా యతీల్లో 813 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి సాగుకు ఎకరాకు సుమారు రూ. 20వేలు వరకు ఖర్చు చేశారు. ఈ సీజన్‌లో చీడపీడల నివారణ కూడా ఎంతో కష్టతరం గా మారింది. అయినా తిండి గింజలు పండించుకో వాల ని, పశు గ్రాసం దొరుకుతుందని రైతులు ఆశపడ్డారు. ఇ ప్పటికే పలువురి రైతుల వరి పంట కోత దశకు చేరింది, పలు చోట్ల పంట నేలవాలింది. అయితే ఉన్నఫలంగా తుఫాను మొదలైంది. ఇప్పట్లో వర్షం వచ్చిందంటే వరి ధాన్యం మొలకలు వచ్చి దిగుబడి దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. తు ఫాను తీవ్రత పెరిగితే వరి పొలాలలో నీరు నిలిచి, కోత వేసే యంత్రాలు కూడా పంట కోయలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు కాస్త దయ తలిస్తే గట్టెక్కవచ్చని పలువురు రైతులు తెలుపుతున్నారు.



రేగాటిపల్లి చెరువులో చిలకం గంగపూజ

ధర్మవరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి చెరువు హంద్రీనీవా జలాలతో నిండింది. దీంతో శనివారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, చాయాదేవి దంపతులు చెరువులో గంగపూజ చేశారు. చెరువు నీటిలోకి చీర, సారే పసుపు, కుంకుమ వదిలి ప్రత్యేక పూజలు చేశారు. రైతుల సంక్షేమ కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి ప్లాంట్ ప్రారంభం: రేగాటి పల్లిలో ప్రజలకు సురక్షిత మంచి తాగునీరు అందించేందుకు చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అత్యాధునిక తాగు నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దానిని శనివారం చిలకం మధుసూదన్‌రెడ్డి, చాయాదేవి దంపతులు ప్రారంభించారు. ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే తవలక్ష్యమన్నారు. ఈ ప్లాంట్ ద్వారా గ్రామంలో ని ప్రతి ఇంటికి నాణ్య మైన తాగునీరు లభిస్తుందని తద్వారా ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లోజనసేన నాయకులు పాల్గొన్నారు.



'లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి'


ధర్మవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్‌చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కళాజ్యోతిసర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. లేబర్‌కోడ్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... ఈనెల 26న కార్మికసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసనకు పిలుపు ఇచ్చామన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


● బత్తలపల్లి/ముదిగుబ్బ:లేబర్ కోడ్ పత్రాలను సీపీఐ నాయకులు శనివారం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో దహనం చేశారు. సీపీఐ జిల్లా నాయకులు రామక్రిష్ణ, కాటమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ముదిగుబ్బలోని బస్టాండ్ కూడలిలో లేబర్ కోడ్‌లకు సంబంధించిన పత్రాలు దహనం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో నంది విగ్రహ ప్రతిష్ఠ

ఓబుళదేవరచెరువు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎం. కొత్తపల్లి వద్ద బండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆల య ఆవరణంలో శనివారం నంది విగ్రహ ప్రతిష్ఠను పురోహి తులు పంచరత్న సురేష్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప ఆలయాలలో పూజ లు నిర్వహించారు. అనంతరం శివాలయం ముఖద్వారం ఎదుట శివాలయ నిర్మాణదాత మహమ్మద్ రఫీ సహాయ సహకారాలతో నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజినేయులు నాయుడు తెలిపారు. అయ్యప్ప మాలధారులకు మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నిజాం వలి, ఎంపీటీసీ శ్రీనివాసులు, అయ్యప్ప మాలధారులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

● ఎస్టీయూ నాయకులు

గాండ్లపెంట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ శనివారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆసీఫ్, మండల నాయకులు చక్రపాణి, కరుణాకర్, వేణు, ఆజాద్, హుస్సేన్, ఖాదర్ బాషా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు

● దరఖాస్తుకు ఈనెల 30వరకు చివరి అవకాశం


● టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి

ధర్మవరం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఇళ్లు మంజూరు చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి అన్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగాది నాటికి రాష్ట్రంలోఐదు లక్షల మందికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్దిదారులు ఈనెల 30లోపు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



నిర్ణయించిన ధరలే ల్యాబ్‌లో తీసుకోవాలి

ధర్మవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజన్ పరిధిలోని అన్ని ల్యాబ్‌లలో నిర్ణయించిన ధరలు మాత్రమే తీసుకోవాలని మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంజన్‌రెడ్డి, వైస్ ప్రసిడెంట్ అశోక్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆ అసోసి యేషన్ కార్యాలయంలో జనరల్ సెక్రటరీ కాడిశెట్టి రామ్మోహన్ చేతుల మీదుగా ధరల పట్టికను విడుదల చేశారు. కార్యక్రమంలో అసోసి యేషన్ జనరల్ సెక్రటరీ మనోహర్, సెక్రటరీ రాజేశ్, కోశాధికారి చరణ్ తేజ, ఆర్గనైజేషన్ సెక్రటరీ కుళ్లాయప్ప, .జాయింట్ సెక్రటరీ శ్యాం, భరత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.




ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీ


● స్వల్పగాయాలతో బయటపడ్డ ప్రయాణికులు

తాడిమర్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిల్లకొండయ్యపల్లి వద్ద ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఆదివారం ఢీకొన్నాయి. ఎవరికీ అపాయం లేదు. అనంతపురం నుంచి కడపకు వెళ్తున్న పులివెందుల డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు, పార్నపల్లి నుంచి బత్తలపల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనం చిల్లకొండయ్యపల్లి సమీపంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్ వద్ద ఢీకొన్నాయి. బొలెరో వాహనం, బస్సు ముందుభాగాలు దెబ్బతిన్నాయి. ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డామని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకుడికి ఎంపీ అంబికా పరామర్శ

ధర్మవరం, నవంబరు22(ఆంధ్రజ్యోతి):మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు సాకే మద్దిలేటిని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు. సాకే మద్దిలేటి ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు బొట్టు కిష్ట, జింకల రాజన్న, పూజామొబైల్ సాయి, దుర్గేశ్, సాకే నరసింహులు, నాగలయ్య శనివారం మద్దిలేటి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.










సాయి కుల్వంతు మందిరంలోని సత్యసాయిబాబా మహా సమాధి వద్ద ప్రణమిల్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్



అలంకరణలో సత్యసాయిబాబా మహాసమాధి

సాయిరాం.. సాయిరాం..!

పుట్టపర్తిలో ఆధ్యాత్మిక పరిమళం.. శత జయంతికి తరలివచ్చిన ప్రముఖులు





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

సత్యసాయి శత జయంతి వేడుకలకు తరలివచ్చిన ప్రముఖులు, భక్తులతో పుట్టపర్తిలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి ప్రేమ సేవలు, ప్రేమ విశ్వవ్యాప్తమని, వాటిని మరింత విస్తరిద్దామని పిలుపునిచ్చారు. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం, మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. విలువలతో కూడిన విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. భావి తరాలకు మార్గదర్శకం కావాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. అంతకు మునుపు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో కలిసి సత్యసాయి మహా సమాధిని సందర్శించారు.సాయికుల్వంతు మందిరంలో విద్యార్థుల 'సాయికథ గాన సుధ' ప్రదర్శన అలరించింది. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. దాదాపు 40వేల మందికి నారాయణ సేవ అందించారు. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



చిన్నారితో కలిసి వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఆర్‌జే రత్నాకర్



జ్ఞాపికను అందుకుంటున్న ఉప రాష్ట్రపతి, వేదికపై సీఎం, మంత్రి, ట్రస్టు ప్రతినిధులు



రాష్ట్రపతి హాజరైన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులు



ఆధ్యాత్మిక జ్యోతి



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు



స్కార్పియో.. ఓ సినిమా కథ

- క్రైం స్టోరీ నడిపిన ఓ టీవీ చానల్ రిపోర్టర్
- సొంత వాహనాన్ని ధ్వంసం చేయించిన వైనం
- నిజాన్ని నిగ్గు తేల్చిన పోలీసులు.. పలువురికి రిమాండ్
- కేసు భయంతో గుంటూరు నుంచి అనంతకు మకాం
- వెతుక్కుంటూ వచ్చిన గుంటూరు పోలీసులు
- వాహనం స్వాధీనం...ఆలస్యంగా వెలుగులోకి...

అనంతపురం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇది ఒక స్కార్పియో కథ. అచ్చం సినిమాని తలపించేలా ఓ టీవీ చానల్ రిపోర్టర్ నడిపిన క్రైం స్టోరీ. కథ మొత్తం స్కార్పియో చుట్టూనే తిరిగింది. గుంటూరులో మూలాలు ఉన్న ఈ స్టోరీ అనం తపురంలో మలుపులు తిరిగింది. చివరకు వాహనాన్ని గుంటూ రు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రైం స్టోరీ ఆలస్యంగా వెలుగుచూసింది. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు టీవీ చానళ్ల రిపోర్టర్లు ఇటీవల సత్యసాయి బాబా జయంతి వేడుకలకు ఒక స్కార్పియో వాహనంలో వెళ్లారు. కొత్తగా వచ్చిన ఆ చానల్ రిపోర్టర్ ఆహ్వానం మేరకు మరిన్ని చానళ్ల రిపోర్టర్లు కూడా వెళ్లారు. ఈ నెల 18న వెళ్లిన రిపోర్టర్లు 19న తిరిగి అనంతపురం వచ్చినట్లు సమాచారం. అయితే రెండు రోజుల కిందట పుట్టపర్తికి వెళ్లేందుకు స్కార్పియోను సమకూర్చిన కొత్త చానల్ రిపోర్టర్‌ను గుంటూరు పోలీసులు, అనంతపురం పోలీసులు పిలిపించారు. ఆ స్కార్పియో కథేంటో చెప్పాలని ఆరా తీశారు. కూపీ లాగి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ చానల్ రిపోర్టర్ కూడా చేసేదేమీలేక వెనుతిరిగి వచ్చారు. అయితే ఆ వాహనంలో పుట్టపర్తి వెళ్లిన చాలా మందికి దాని వెనుక ఉన్న అసలు కథ మాత్రం తెలియదు. అయితే దీని వెనుక థ్రిల్లింగ్ స్టోరీ ఉన్నట్లు పోలీసు విచారణలో బట్టబయలైంది.

క్రైం స్టోరీ గుంటూరు టు అనంతపురం

ఈ స్కార్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం వెనుక అసలు క్రైం స్టోరీ గుంటూరులో జరిగినట్లు సమాచారం. గుంటూరులో ఓ సీఐకు, మరో చానల్ రిపోర్టర్‌కు వివాదం ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ రిపోర్టర్ కొంతమందికి మాస్కులు వేయించి, తన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేయించాడు. ఈ మొత్తం సీన్‌ను సెల్‌ఫోన్‌లో రికార్డు చేయించాడు. తర్వాత తన వాహనాన్ని ఓ సీఐ ధ్వంసం చేయించాడంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులకు అనుమానం వచ్చి విచారణ చేయడంతో ఈ మొత్తం ఎపిసోడ్‌కు రచయిత, డైరెక్షన్ అంతా ఆ టీవీ చానల్ రిపోర్టరేనని తేలింది. ఆ రిపోర్టర్ కొంత మంది మాస్కులు వేసుకున్న వారితో ధ్వంసం చేయించడం, ఆయన సెల్‌ఫోన్‌లో రికార్డు చేయించడం, అంతా సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో అసలు కథ బయటపడింది. ఈ కేసులో మాస్కులు వేసుకుని వాహనాన్ని ధ్వంసం చేసిన వారిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. అయితే కీలక వ్యక్తి మాత్రం గుంటూరులో తప్పించుకుని అనంతకు వచ్చాడు.

అదే వాహనంతో అనంతకు...

గుంటూరులో పోలీసులకు దొరక్కుండా తప్పించుకున్న ఆ చానల్ రిపోర్టర్ తన మకాం అనంతకు మార్చాడు. తన స్కార్పియో వాహనంలోనే గుంటూరు నుంచి హైదరాబాద్ మీదుగా అనంతపురం వచ్చినట్లు సమాచారం. అయితే అప్పటికే నిఘా ఉంచిన గుంటూరు పోలీసులు అన్ని టోల్‌గేట్ల సీసీ కెమెరాలు పరిశీలించారు. గుంటూరు నుంచి అనంతపురం వరకూ సీసీ కెమెరాల్లో కనిపించిన ఆ వాహనం అనంతపురం దాటి వెళ్లకపోవడంతో నిందితుడు ఇక్కడే ఉన్నాడంటూ అనుమానించారు. అతడిని వెతుక్కుంటూ ఇటీవల జిల్లాకు వచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన ఆ చానల్ రిపోర్టర్, అనంతపురంలోని అదే చానల్‌లో పని చేసే స్థానిక రిపోర్టర్‌కు వాహనం అప్పజెప్పాడు. ఎలాగూ చేతిలో వెహికల్ ఉందంటూ ఆ కొత్త చానల్ స్థానిక రిపోర్టర్‌తోపాటు, మరికొన్ని చానళ్ల రిపోర్టర్లు 18, 19 తేదీల్లో పుట్టపర్తికి కవరేజ్ కోసం వెళ్లి వచ్చారు. అయితే అప్పటికే జిల్లాకేంద్రానికి చేరుకున్న గుంటూరు పో లీసులు, అనంతపురం పోలీసులతో కలిసి విచారణ చేశారు. గుం టూరులో ఓ టీవీ చానల్ రిపోర్టర్ నడిపిన క్రైం స్టోరీ వెహికల్ అనంతపురంలోని అదే చానల్ రిపోర్టర్ వద్ద ఉన్నట్లు గుర్తించి, విచారణ చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వాహనాన్ని గుంటూరుకు తరలించారు. అయితే ఈ విషయాలేవీ తెలియక అందులోనే పుట్టపర్తికి వెళ్లిన రిపోర్టర్లు విషయం తెలుసుకుని 'అయ్యబాబోయ్...ఈ స్కార్పియో వెనుక ఇంత కథ నడిచిందా' అంటూ ముక్కున వేలేసుకున్నారు.

సీఐ సతీష్ హత్య కేసును నిష్పాక్షికంగా విచారించాలి

- కుమ్మర శాలి వాహన సంఘం



సమావేశమైన కుమ్మర శాలి వాహన సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ విజిలెన్స్ ఆఫీసర్, సీఐ సతీష్‌కుమార్ హత్య కేసును నిష్పక్షపాతంగా విచారించి, నేరస్థులను కఠినంగా శిక్షించాలని ఏపీ కుమ్మర శాలి వాహన రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు పోతులయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ కుమ్మర శాలి వాహన సంఘం జిల్లా కార్యాలయం లో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన సంఘం నాయకులు శనివారం సమావేశమయ్యారు. సీఐ సతీష్‌కుమార్ హత్యను తీవ్రంగా ఖండించారు. పోతులయ్య మాట్లాడుతూ సీఐ సతీష్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించడంతోపాటు రూ.ఆరు కోట్లు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్యకు ఉద్యోగం ఇచ్చి, పిల్లల చదువులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కేవీ రమణ, ఆంజినేయులు, గోపాల్, కృష్ణ, మలరాయుడు, రామాంజినేయులు, ఓబులేసు, వెంకటేష్, సంగమేశ్ పాల్గొన్నారు.

చిట్టి చేతలు..!

సృజనకు ప్రాణం... స్వయం ఉపాధికి సోపానం

- అబ్బురపరిచిన చిన్నారుల ఆవిష్కరణలు
- అట్టహాసంగా జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పోటీలు



చీర కట్టులో వైవిధ్యంగా ముస్తాబు అయిన రాయదుర్గం కేజీబీవీ విద్యార్థినులు

బుక్కరాయసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టి చేతులు ఎన్నో చిత్రాలను చేశా యి. అబ్బురపరిచే కళాఖండాలను సృష్టించా యి. జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పోటీల్లో బాలబాలికలు తమలోని సృజనకు పదును పెట్టారు. సమగ్రశిక్ష, విద్యాశాఖ అధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో శనివారం నిర్వహించిన పోటీల్లో బాలబాలికల ఆవిష్కరణలు అబ్బురపరిచాయి. సైబర్ సెక్యూరిటీ మొదలుకుని.. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్ వ్యవస్థ, వస్త్రాలు, ఆహార పదార్థాల తయారీ, ఆటోమోటివ్, వ్యాపారం తదితర రంగాల్లో ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపజేశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దా దాపు 800 మంది విద్యార్థులు 252 ప్రాజెక్టు న మూనాలను ప్రదర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, హ్యాకింగ్, క్యూఆర్ కోడ్, కంప్యూటర్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పులపై ప్రాజెక్టులను రూపొందించారు. సైబర్ మోసాల పట్ల ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. బాలికలు బ్యూటీషియన్ కోర్సులో మెలకువలు, చీరకట్టులో వైవిధ్యం, ఫ్యాషన్ ట్రెండ్స్‌పై ప్రాజెక్టులను రూపొందించారు. చదువు పూర్తయ్యాక సొంత కాళ్లపై నిలబడేందుకు ఈ నైపుణ్యాలు ఎంతో దోహదపడతాయని టీచర్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులను అందజేశారు. ప్రదర్శనను సమగ్రశిక్ష ఏపీసీ శై లజ, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కే జీబీవీ ప్రత్యేకాధికారి నాగవేణి, ఎంఈఓ లింగానాయక్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో స్వయం ఉపాధి

బ్యూటీషియన్ కోర్సులో భాగంగా మెహందీ డిజైన్లు, చీర కట్టులో వైవిధ్యం, బ్యూటీ టిప్స్ తదితర అశాలను నేర్చుకున్నా. బ్యూటీపార్లర్ షాపు పెట్టుకునేందుకు ఇది దోహదపడుతుంది.

- శృతి, రాయదుర్గం కేజీబీవీ

సాంకేతికతపై పట్టు సాధించేందుకు కృషి

సైబర్ సెక్యూరిటీపై ప్రాజెక్టు రూపొందించాం. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలనే దానిపై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయి.

- మేఘన, సిరి, వజ్రకరూరు ఆదర్శ పాఠశాల

కొత్త ఆలోచనలకు వేదిక..

ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో అవకాశాలను ప్రాజెక్టుల ద్వారా తెలుసుకోగలిగాం. బయట మార్కెట్‌లో ఏ వస్తువుకు డిమాండ్ ఉంది, దానిని ఎలా తయారు చేయాలి తదితర విషయాలపై స్పష్టత వచ్చింది. ప్రస్తుతం శాండ్ విచ్, కేక్‌లు, జామ్‌లు, ఎగ్ పఫ్, వెజ్ పఫ్ వంటి వాటికి డిమాండ్ ఉంది. ప్రస్తుతం పొందిన శిక్షణ ద్వారా బేకరీ నిర్వహించవచ్చు.

- తేజశ్విని, విరీష, మోక్షిత రెడ్డి, హనీషా, పామిడి ఆదర్శ పాఠశాల

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి..

పోటీ ప్రపంచంలో మనుగడ సాగించాలంటే విద్యార్థులు పుస్తక జ్ఞానంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నాం. స్వయం కృషితో జీవించడానికి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యమే అసలైన పెట్టుబడి.

- శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష



బ్యూటీషియన్ కోర్సు గురించి వివరిస్తున్న విద్యార్థిని శ్రుతి



సైబర్ సెక్యూరిటీపై ప్రాజెక్టు నమూనా రూపొందించిన వజ్రకరూరు విద్యార్థులు



పామిడి మోడల్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన బేకరీ ఐటమ్స్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎస్ ఏపీసీ శైలజ

మద్యం దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- కూలీ మృతి.. కాలిపోయిన మద్యం బాటిళ్లు



నితిన్ కుమార్ (ఫైల్)

పరిగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిందునగర్‌లోని ఏవీ వైన్స్‌లో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో అందులో ఉన్న కూలీ నితిన్‌కుమార్ (40) మరణించాడు. షాపులోని మద్యం బాటిళ్లు కాలిపోయాయి. ఏఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పావగడ తాలూకా పాలెల్లి గ్రామానికి చెందిన నితిన్‌కుమార్ వైన్స్ షాపులో కూలీగా పనిచేస్తుండేవారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని షాపులోనే నిద్రించాడు. షార్ట్‌సర్క్యూట్‌తో షాపులో మంటలు చెలరేగాయి. ఊపిరాడక అతడు అక్కడికక్కడే మరణించాడు. మద్యం బాటిళ్లు కాలిపోయాయి. ఎంత మేర నష్టం వాటిల్లింది తెలియరాలేదు. షాపును ఏఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నితిన్‌కుమార్ మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అన్నదాత సుఖీభవతో రైతు కళ్లలో ఆనందం

- 43,000 మంది రైతులకు రూ.29.22 కోట్లు జమ
- అర్హులైన వారందరికీ పథకం వర్తింపు



మడకశిర రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతుల ఖాతాలోకి రూ.7వేలు జమకావడంతో వారిలో ఆనందం వెల్లువిరుస్తోంది. నియోజకవర్గంలో 43,300 మంది రైతలకు రూ.29.22 కోట్లు వారి ఖాతాల్లో జమ అయినట్లు వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. అందులో మడకశిర 12,379 మంది రైతులకు రూ8.33 కోట్లు, గుడిబండ 9578 మందికి గాను రూ.6.47 కోట్లు, రొళ్ల 6,446 మందికి రూ.4.36 కోట్లు. అగళి 5,747 మందికి రూ.3.76 కోట్లు. అమరాపురం 9,250 మందికి రూ.6.30 కోట్లు జమ అయినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించినట్లు ఏఓ తిమ్మప్ప తెలిపారు.

రైతుల కష్టాలు తెలిసిన సీఎం



నా ఖాతలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రూ.7 వేలు జమ అయ్యింది. సీఎం చంద్రబాబుకు రైతు కష్టాలు బాగా తెలుసు. రైతులను ఆదుకుంటున్న వ్యక్తి చంద్రబాబు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- సత్యనారాయణ, రైతు, గౌడనహళ్ళి

హామీలు నెరవేర్చిన సీఎం



ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారు. వైసీపీ పాలనలో రూ.13 వేలు మాత్రమే ఇచ్చేవారు. రైతుల బాధలు తెలుసుకున్న కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచారు. మొదటి విడతగా రూ.7వేలు, రెండో విడతగా రూ.7 వేలు, మూడో విడతగా రూ.6 వేలు ఇస్తున్నారు.

-వెంకటరెడ్డి, సి. కోడిగేపల్లి

జాబ్‌కార్డులకు 216 దరఖాస్తులు



సింగిరెడ్డిపల్లిలో గ్రామసభకు హాజరైన ఉపాధి కూలీలు

గోరంట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల్లో జరిగిన గ్రామసభల ద్వారా జాబ్‌కార్డుల కోసం శనివారం వరకు 216 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఉపాధికూలీతో ఈకేవైసీ ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. ఈకేవైసీలో తొలగించిన జాబితాపై అభ్యంతరాల స్వీకరణం కోసం గ్రామసభ నిర్వహించారు. 133మంది జాబ్‌కార్డు రీయాక్టివేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, 83 మంది హౌసింగ్‌కోసం కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. మండలంలో ఇంకా 3,376మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా శనివారం 11గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు, ఏపీఓ శివన్న ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కూలీల నుంచి 200దరఖాస్తులు అందినట్లు ఏపీఓ తెలిపారు. రామచంద్రప్ప, కృష్ణమూర్తి, రంగస్వామి, కార్యదర్శి నరేష్‌బాబు, కుమారస్వామి, ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు గౌడ రంగప్ప, శ్రీనివాస్‌యాదవ్, శివన్న పాల్గొన్నారు.

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఏపీఓ ఓబులప్ప మాట్లాడుతూ 11పంచాయతీల్లో 78,383 జాబ్‌కార్డులున్నాయని అందులో 6973ఈకేవైసీ చేశామన్నారు. ఇందులో 437వలస, మరణించిన వాటిని జాబ్‌కార్డులోంచి తొలగించారు. 164దరఖాస్తులు అందినట్లు ఏపీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, టీఏలు మారేగౌడ్, స్వాతి, ఎఫ్ఏలు రాజు, చంద్రప్ప, ఉదయ్, మురళి, మూర్తి, నాయకులు నాగరాజు, నారాయణప్ప పాల్గొన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా పంచాయతీల్లో గ్రామసభలను శనివారం నిర్వహించినట్లు ఏపీఓ మంజునాథ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 5396జాబ్‌కార్డులున్నాయి. 13పంచాయతీలలోనూ ఈకేవైసీ ప్రక్రియలో 200మంది జాబ్‌కార్డుల కోసం దరకాస్తులు చేసుకున్నారు. అందులో 100మంది హౌసింగ్ కోసం దరఖాస్తుచేసుకున్నట్లు తెలిపారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభలో ఈకేవైసీలో తొలగించిన సభ్యులు మార్పులు చేర్పులకు 32 అర్జీలు సమర్పించగా కొత్త జాబ్‌కార్డుకోసం 89అర్జీలు వచ్చాయని ఏఓ నర్సింగరావు తెలిపారు.

సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును శనివారం సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఉన్న ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుంచి ఉన్నారు, ఏఏ కేసులో జైలుకు వచ్చారనే దానిపై ఆరాతీశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశాల్లో తప్పులు చేసి కారాగారాలకు రావడంవల్ల మీ కుటుంబ గౌరవ మర్యాదలు దెబ్బతింటాయన్నారు. అంతేకాక ఆర్థికంగా చితికిపోతారని సమాజంలో మీపట్ల చిన్నచూపు చూస్తారన్నారు. మరీ ముఖ్యంగా చేసిన తప్పులే మళ్లీ చేసి జైలుకు వస్తే పోలీస్ రికార్డుల్లో శాశ్వత నేరగాళ్లగా మారతారన్నారు. ఎవరికైనా న్యాయవాదిని ఏర్పాటుచేసుకునే స్థోమత లేకపోతే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటివారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచస్తామన్నారు. న్యాయాధికారి వెంట న్యాయవాదులు రాజశేఖర్, నవేరా, లోక్ అదాలత్ సభ్యులు హేమావతి, రాజు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేపడుతున్న ఆర్అండ్‌బీ అధికారులు

సోమందేపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి నుంచి కేతగాని చెరువు వరకు యాన్యువల్ మెయింటెనెన్స్ నిధులతో శనివారం అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. సోమందేపల్లి-హిందూపురం రోడ్డుమధ్య ఏర్పడిన గుంతలను ప్యాచ్‌వర్క్ చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం రూ.5 లక్షల నిధులతో పనులను ప్రారంభించామన్నారు. చాకర్లపల్లి రైల్వేగేటుకు రెండు వైపులా రోడ్డు మరమ్మతులకు రూ20లక్షలు అవుతుందని తెలిపారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. ఆంధ్రజ్యోతిలో రోడ్ల దుస్థితిపై కథనం ప్రచురితమైంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై దృష్టిసారించింది.

ఆర్థిక సాయం



మహబూబ్‌బాషాకు నగదు అందజేస్తున్న నిమ్మల శ్రీధర్, నాయకులు

గోరంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు మహబూబ్‌బాషా భార్య మోహీమా అనారోగ్యంతో ఉండగా, వైద్య చికిత్సలకోసం టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ రూ.52వేలు శనివారం అందించారు. ఆమె గర్భవతిగా ఉండగా అనారోగ్యానికి గురై చికిత్సలకోసం ఇబ్బంది పడుతున్నారు. బాధితులు నిమ్మల శ్రీధర్‌ను ఆశ్రయించగా, వెంటనే స్పందించిన ఆయన పార్టీ నాయకులు నీలకంఠారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ నబీరసూల్, కలీమ్‌ఖాన్, సహకారంతో నగదు మొత్తాన్ని బాధితులకు అందించారు. నాయకులు హరిప్రసాద్, నరేంద్ర, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యశోదమ్మ, ఉమేష్‌ల కుమారుడు మహేష్‌రాజ్ (25) బ్రెయిన్ ట్యూమర్‌వ్యాధితో శుక్రవారం బెంగళూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఐదురోజులుగా మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. మహేష్ కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం టీడీపీ మండల కన్వీనర్ వెంకటాపురం అబి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, వారి ఇంటివద్దకు వెళ్లి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈడిగ చంద్ర, అంగడి అంజి, సైపుల్లా, డిష్ మంజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి

పెనుకొండ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్ద 44వ జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని గోబీలాల్ బెహ్రా(57)అనే నేపాల్‌వాసి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు గోబీలాల్‌బెహ్రా తోటి స్నేహితులతో కలిసి నేపాల్ నుంచి బెంగళూరుకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్నాడు. ఈశ్వర్‌రబ్బర్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే బస్సు రిపేరీ కావడంతో గోబీలాల్‌బెహ్రా బస్సుదిగి రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోబీలాల్‌బెహ్రాను 108సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లేబర్‌కోడ్ జీఓ ప్రతుల దహనం



లేబర్‌కోడ్ నోటిఫైడ్ కాపీలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి అమలు చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్‌కోడ్ ప్రతులను దహనం చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ నాయకులు బాబావలి, నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను హరించి పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చిందన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉద్యోగులకు, ఉద్యోగ భద్రత ఉండదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఈ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బావమ్మ, తిప్పన్న, వెంకటరాముడు, నరసింహులు, ఆనంద్, వలీ, ఓబులేసు, హనుమంతు, సలీం పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్లను రద్దు చేయాలని శనివారం తహసీల్దార్ మారుతిని సీపీఎం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జీఓ కోడ్లను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. జిల్లా నాయకులు పెద్దన్న, కొండా వెంకటేశులు, నాగభూషణం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయండి

- బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణ

పెనుకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బహుజన సమస్యల పరిష్కారమే పనిచేయాలని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని గోల్డెన్ ఎంపైర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి బహుజన చైతన్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా నియోజకవర్గం మండల స్థాయి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జయరాములు, ప్రధాన కార్యదర్శిగా కొట్నూరు శేఖర్, కార్యదర్శిగా దొడగట్ట గోపాల్, ఉపాధ్యక్షులుగా కోనాపురం కొల్లప్ప, బూచర్ల నర్సింహులు, టేకులోడు అనిల్, సంయుక్త కార్యదర్శిగా శెట్టిపల్లి నర్సింహులు, బీచిగానిపల్లి హనుమంతు, గుట్టూరు యల్లప్ప, సమన్వయకర్తగా రొద్దం తిరుపతయ్య, జిల్లా గౌరవాధ్యక్షునిగా రంగేపల్లి నరసప్ప, గంగాధర్, పెనుకొండ నియోజకవర్గం మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సోమందేపల్లి వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వానవోలు వెంకటలక్ష్మమ్మ, పెనుకొండ మండల కమిటీ అధ్యక్షుడిగా నాగలూరు శివ, ప్రధాన కార్యదర్శి తులసీరాం, మునిమడుగు హరి, ఉపాధ్యక్షులుగా గుట్టూరు నరసింహులు, నాగలూరు అంజి, సంయుక్త కార్యదర్శిగా గుట్టూరు సుధాకర్, నాగలూరు హనుమంతు, సమన్వయకర్తగా పూజారి రమేష్, రాజశేఖర్, మునిమడుగు పెద్దన్న ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, రొద్దంబాబు, నాగార్జున, ఆనంద్, బీచిగానిపల్లి రామాంజినప్ప, చల్లాపల్లి ఈశ్వర్, కదిరప్ప, రామాంజనేయులు ఎన్నికయ్యారు.



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర నేతలు

న్యూస్ బాక్స్

పేట వెంకటరమణుడికి ప్రత్యేక పూజలు



హిందూపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం మొదటి శనివారం పురస్కరించుకుని పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ప్రాకారోత్సవం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



పూజల్లో పాల్గొన్న నాయకులు

సోమందేపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకలపల్లిలో శనివారం భక్త కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానికులు కనకదాస చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు చేశారు. గ్రామంలో తొలిసారిగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం కనకదాస జీవిత చరిత్రను వివరించారు. స్థానిక నాయకులు కృష్ణమూర్తి, ప్రజలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ప్రారంభం



భిక్షలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంది సర్కిల్ సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి భిక్ష కార్యక్రమం ప్రారంభించారు. డిసెంబరు 31వరకు కార్యక్రమం కొనసాగుతుందని గురుస్వామి బాలాజీ తెలిపారు.

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండ క్రాస్ షిర్డీసాయి మందిరంలో అయ్యప్ప మాలధారులకు శనివారం భిక్ష ఏర్పాటు చేశారు. హైదరాబాదుకు చెందిన సువర్ణముఖి ట్రస్ట్ సభ్యులు హైదరాబాద్ నుంచి కాలినడకన 300 మంది శబరిమలకు వెళ్తుండగా కురుబవాండ్లపల్లికి చెందిన కేవీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్, రవిశంకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పీఏ వీరయ్య

హిందూపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు హిందూపురానికి చెందిన పలువురు కరాటే విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం నుంచి రాజమండ్రిలో జరిగే పోటీలకు అండర్-14, 17, 19 విభాగంలో 13మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. విద్యార్థులకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సహాయ సహకారాలు అందించారు. వీరిని శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏలు వీరయ్య, బాలాజీ అభినందించారు.

జాతీయ అడ్వెంచర్ క్యాంప్‌నకు..



విద్యార్థికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్, పీఓ

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో బీకాం ఫస్టియర్ చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీరు లిఖిత్‌కుమార్ జాతీయ అడ్వెంచర్ క్యాంప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జయప్ప, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రతాప్ తెలిపారు. శనివారం విద్యార్థిని వారు అభినందించారు. ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విజేత జట్టు కెప్టెన్‌కు ట్రోఫీ అందజేస్తున్న సీసీ హరి

సోమందేపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని టీడీపీ నాయకుడు సీసీ హరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో యువతలో స్ఫూర్తి నింపేందుకు ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. నేటితరం సెల్‌ఫోన్ గేముల్లో, టీవీల్లో కాలం గడుపుతోందని, వారు క్రీడలవైపు వెళ్తే ఆరోగ్యం బాగుంటుందన్నారు. గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. స్థానిక యువకులు పాల్గొన్నారు.

డీకే శివకుమార్ సీఎం కావాలని తులాభారం

పావగడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని ఆయన అభిమానులు శనివారం శనైశ్చర ఆలయంలో 91కేజీల నువ్వుల నూనెతో తులాభారం చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రెండున్నర సంవత్సరాలకు గాను కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని నిర్ణయించడంతో డీకే శివకుమార్‌కు కుజదోషం, శనిదోషం, తల్లిదండ్రులైన కెంపేగౌడ, గౌరమ్మ, ఉష, కుటుంబ సభ్యులందరి తరఫున అర్చన చేయించారు. మాజీ టీపీ సభ్యుడు హనుమంతరాయప్ప, గోవిందరాజు, చిక్కన్న, హరీష్, ఉమాపతి పాల్గొన్నారు.



డీకే శివకుమార్ చిత్రపటంతో తులాభారం నిర్వహిస్తున్న అభిమానులు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

మడకశిరటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంతో మాట్లాడినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అలాగే భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ, మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అనంతరం సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం: డీఈ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్నానాల గదులు, సలభ్ కాంప్లెక్స్‌ను నిర్మించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ నర్సేగౌడ్ తెలిపారు. వారు మాట్లడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రూ.22 లక్షలతో స్నానాల గదులు, సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించిట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి స్వచ్ఛభారత్ మిషన్ నుంచి రూ.12 లక్షలు, దేవదాయశాఖ నుంచి రూ.5 లక్షలు, ఎం పీపీ గ్రాంట్ నుంచి రూ.5 లక్షలు వెచ్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో స్వామివారి జాతర జరగనున్న దృష్ట్యా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

ఘనంగా పేరెంట్స్ డే



విజేతలను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ క్రిష్ణారావు, చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి

గోరంట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం వద్దనున్న నాసిన్ ఆవరణంలోని కేంద్రీయ విద్యాలయంలో గ్రాండ్ పేరెంట్స్‌డేను శనివారం ఘనంగా నిర్వహించారు. మూడు నెలలక్రితం కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ క్రిష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నాసిన్‌లోని టీపీడబ్ల్యూటీ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల అవ్వాతాతలచే పోటీలు నిర్వహించి, విజేతలను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో అవ్వాతాతలు నృత్యాలు చేస్తూ ఆహూతులను రంజింపచేశారు. తక్కువ సమయంలో కేవీ పాఠశాల ఖ్యాతిచెందేలా కృషి చేస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రిన్సిపాల్ కృషిచేశారని, చీఫ్ ఇంజనీర్ కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ దంపతులను చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భక్తవత్సలం

గోరంట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌పీవీఎం డిగ్రీకళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ భక్తవత్సలం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవడంతోపాటు క్రమశిక్షణ, సేవాభావం అలవాటు చేసుకుంటేనే మంచి ఉత్తీర్ణత సాధించగలరని ప్రిన్సిపాల్ సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అధ్యాపకులు ఆజాద్, అరవింద్, నందగోపాల్, హరీష్, కవిత, బాలమోహన్, సురేష్, నౌరీన్ పాల్గొన్నారు.

స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

రొళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రవికృష్ణ ఆధ్వర్యంలో స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ అజెండాలోని అంశాలను సెషన్లవారీగా వివరించారు. ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్ టెస్ట్, 100 డేస్ యాక్షన్‌ప్లాన్, ఆబ్సెంట్, సెకండరీ స్థాయి వాళ్లకు ఎస్ఎస్‌సీ 100డేస్‌పై వివరించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.